క్లుప్తంగా

ఆదర్శ విద్యాలయంలో స్పాట్ కౌన్సిలింగ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో ఉన్న ఆదర్శ విద్యాలయంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ పంబాల సదానందంయాదవ్ తెలిపారు. బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మిగిలిన ఖాళీ సీట్లకు ఆగస్టు 15 లోగా ఔత్సాహికులైన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

సుల్తానాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మంగళవారం జిల్లా కార్యకర్తల సమ్మేళనానికి హాజరు కానున్నారని జిల్లా కార్యదర్శి మహేందర్‌యాదవ్, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. సుల్తానాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించి పెద్దపల్లి వెళ్తారన్నారు.

విద్యారత్న నేషనల్ అవార్డుకు ఎంపిక



ఎంపిక పత్రం అందుకుంటున్న యాదగిరిగౌడ్

జ్యోతినగర్: విద్యారత్న నేషనల్ అవార్డుకు విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ ఎంపికయ్యారు. సోమవారం అవార్డు ఎంపిక పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఉమ్మడి కమాన్‌పూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జూలపల్లి గ్రామానికి చెందిన వైనాల రాజు ఎంపికయ్యారు. యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, చక్రపాణి సోమవారం రాజును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి..

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం బుర్హమియాపేట్ గ్రామానికి చెందిన రాచర్ల హరిబాబు డాక్టరేట్ సాధించగా.. సోమవారం మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ భవనం ఆవరణలో బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. పలువురు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొంది పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న డాక్టర్ రాచర్ల హరిబాబు బహుజనులకు ఆదర్శప్రాయుడయ్యాడని కొనియాడారు.

గ్రామ సమస్యలపై వినతి

పాలకుర్తి: మండల పరిధిలోని బామ్లానాయక్ తండాలో నూతనంగా రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ బదావత్ జ్యోతి–శంకర్‌నాయక్ జిల్లా జాయింట్ కలెక్టర్ వేణును కలిసి విన్నవించారు. బామ్లానాయక్ తండాకు వెళ్లాలంటే మధ్యలో రైల్వే ట్రాక్ అడ్డుగా ఉందని, ఈ కారణంగా దాదాపు 5 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని, స్థానికులు అవస్థలు పడుతున్నారని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన

ఓదెల: గుంపుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదేశాల మేరకు అర్హులైనవారందరూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులున్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

సుల్తానాబాద్: వర్షానికి రోడ్డుపైకి వచ్చిన చెత్త, ఇసుక వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రమేశ్ సూచించారు. సోమవారం రహదారులను మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు.

ఆసుపత్రికి జ్వర బాధితుల తాకిడి

- రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య


సుల్తానాబాద్ ఆసుపత్రిలో రోగులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి జ్వరాలతో వస్తున్న రోగుల తాకిడి పెరిగింది. అత్యవసర పరిస్థితుల్లో వచ్చి అడ్మిటయ్యే వారి సంఖ్య ఎక్కువగా లేకున్నా.. ఓపీకి వచ్చి వైద్యులతో పరీక్షలు చేయించుకొని వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. సాధారణ రోజుల్లో ప్రతి సోమవారం, బుధవారం, శనివారాల్లో 300 నుంచి 400 వరకు ఓపీ సేవలున్నాయి. ఇటీవల ఓపీ సేవలు 440 వరకు పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జలుబు, దగ్గు, నొప్పులు, జ్వరాలతో వచ్చే వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వర్షాలు కురవడం, వాన తర్వాత అపరిశుభ్రంగా మారే పరిసరాలతో దోమలు వృద్ధి చెంది విహారం చేస్తూ కుట్టడంతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు తెలుపుతున్నారు.

పెద్ద ఆసుపత్రి ఇదే..

సుల్తానాబాద్ చుట్టుపక్కల పెద్ద ఆసుపత్రి ఇదే కావడంతో సుల్తానాబాద్ పట్టణంతోపాటు వివిధ గ్రామాలు, మండలాలకు చెందిన ప్రజలు ఆసుపత్రికి వస్తూ సేవలు పొందుతున్నారు. ఎక్కువగా వ్యవసాయ పనులు చేసుకునేవారే అధికంగా ఉన్నారు. పనులకు వెళ్లి వచ్చేవారు అనారోగ్యాల బారిన పడే అవకాశం అధికంగా ఉంటుందని ఆస్పత్రి సిబ్బంది తెలుపుతున్నారు. సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల వారు సైతం ఆసుపత్రికి వస్తూ సేవలు పొందుతున్నారు.

పరిసరాల అపరిశుభ్రతతో..

ఉదయం 7 గంటల్లోపే పల్లె, పట్టణంలో ఉన్న సిబ్బంది కాలనీలు తిరిగి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలగించాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. ఓపెన్ నాలాలు ప్రవహించడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతాయని, వర్షాల అనంతరం మారుతున్న పరిణామాల వల్లే దోమలు మరింత వృద్ధి చెందుతాయని ప్రజలకు సూచించాలని ఆయన పలు సందర్భాల్లో చెప్పారు. పట్టణంతోపాటు పల్లెల్లో పల్లె దవాఖానలున్నా.. స్థానికంగా డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణంతోపాటు పలు గ్రామాల్లో డెంగీ కేసులు నమోదైన విషయం తెలిసిందే.



సేవలు బాగున్నాయి

సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. జ్వరం వచ్చిందని ఆసుపత్రికి వచ్చా. పలు రకాల పరీక్షలు చేశారు. పండ్లు ఇచ్చారు. ప్రైవేటు కంటే ప్రభుత్వాసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు చేస్తున్నారు. ఇది పేదల దవాఖాన అని చెప్పొచ్చు.

– శిరీష, పూసాల, జ్వర బాధితురాలు

అందుబాటులో మందులు



ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రక్త, మూత్ర పరీక్షలతోపాటు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించా. డెంగీ విష జ్వరాలకు సంబంధించిన అన్ని మందులు ప్రభుత్వాసుపత్రిలో ఉన్నాయి.

– డాక్టర్ రమాదేవి, డీడీవో, సుల్తానాబాద్

సమయపాలన పాటించాలి



ప్రభుత్వ ఆసుపత్రికి పేద రోగులు అత్యధికంగా వచ్చి వైద్య సేవలు పొందుతారు. సమయపాలన పాటించని డాక్టర్లు, సిబ్బందిపై చర్య తీసుకోవాలి. ఆసుపత్రిలో సమయ వేళలు పాటించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి.

– పదాల అజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్, గర్రెపల్లి

ముర్రు పాలతో రోగ నిరోధక శక్తి


ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో..

రామగుండం: జన్మనిచ్చిన తల్లి ముర్రు పాలు చిన్నారికి పట్టిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని, ప్రతీ ఒక్కరు ముర్రు పాలను చిన్నారులకు పట్టించేలా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారిస్తూ బాలింతలకు అవగాహన కల్పించాలని అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్ అన్నారు. సోమవారం తల్లి పాల వారోత్సవాలను అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహికంగా నిర్వహించారు. మండల పరిధిలోని గర్భిణులకు సీమంతం చేసి నూతన వస్త్రాలను సమర్పించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అంజలి, అంతర్గాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో సోమవారం అడ్డగుంటపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు క్లబ్ సభ్యులు, మెడికల్ ఆఫీసర్ స్నేహలత తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. క్లబ్ సభ్యుడు గుంత వినోద్ పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందించారు.

ఎలిగేడు: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ధూళికట్ట గ్రామ పల్లె దవాఖాన వైద్యురాలు సింధూర అన్నారు. ధూళికట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–3, బుర్హాన్‌మియాపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ చైతన్యపురికాలనీలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత మాట్లాడారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కమాన్‌పూర్: రొంపికుంట గ్రామంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి ప్రజల నుంచి స్పందన వచ్చిందని అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి తెలిపారు. కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు చేశారు. నల్లవెల్లి శంకర్, గుమ్మడి అంజయ్య, చెప్యాల సమ్మయ్య, జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్, కమ్మగొని మల్లయ్య, గుమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం


విరాళం అందిస్తున్న దాత

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ రుద్రాభిషేక ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు. కోనరావుపేటకు చెందిన మల్లారపు ఆంజమ్మ, రాజనర్సయ్య ఆలయ అభివృద్ధికి రూ.25వేల విరాళం అందజేశారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

సుల్తానాబాద్: పట్టణంలోని పాత శివాలయంలో శ్రావణ మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓదెల శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సామల యమున–హరికృష్ణ దంపతులను సన్మానించారు.

డ్రైనేజీల్లో చెత్త వేయొద్దు


ఒర్రె కాలువలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: డ్రైనేజీల్లో చెత్త వేయొద్దని, ప్రభుత్వం అందించిన చెత్త బకెట్లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో పూర్ణచందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కాలువల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించారు. నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు పారబోయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్ అన్నారు. ఎంపీవో ఆరీఫ్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు


పాల్గొన్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సహకారంతో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు 3 రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. మొదటి రోజు శ్వాస మీద ధ్యాస, రెండో రోజు నిర్మలీకరణ ప్రక్రియ, మూడో రోజు ప్రార్థన అనే అంశం వివరించి ధ్యానంలో శిక్షణనిచ్చి ముగించారు. ట్రైనర్ ఆనంద్, శ్రీనివాస్, మహర్షి, సైకాలజిస్టు జీడి కనకయ్య, శ్రీగోదా, జాతీయ సేవాపథకం అధికారి దేవిదాస్, అధ్యాపకులు మంతెన శ్రీనివాస్, శంకరయ్య, కమలాకర్, సతీశ్, రామ్మూర్తి, రమాదేవి, శైలజ, షాహిన్, ఆస్మ, జగదీశ్వరి, శారద పాల్గొన్నారు.

చెట్లు తొలగింపు



ఓదెల: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డుకిరువైపులున్న చెట్లను పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ తొలగించారు. ఇందుర్తి ఎక్స్‌రోడ్డు గూడెం, పొత్కపల్లి, గుంపుల వెళ్లే రహదార్లకిరువైపులా పెరిగిన చెట్లను తొలగించారు.

ప్రహరీ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న అయోధ్యసింగ్ ఠాకూర్

రామగుండం: పట్టణంలోని జెన్‌కో క్రీడామైదానానికి ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయోధ్యసింగ్ ఠాకూర్ చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు సలీంబేగ్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లడంతో జెన్‌కో అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. జెన్‌కో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ దాసరి శంకరయ్య, ఈఈ సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, బల్వన్‌సింగ్ ఠాకూర్ తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరణ

జూలపల్లి: మండల వెలుగు సమాఖ్య ఏపీఎంగా పి.సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం పద్మ కమాన్‌పూర్ మండలానికి బదిలీ కాగా.. ఎలిగేడు మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న పి.సుధాకర్ బదిలీపై జూలపల్లికి వచ్చారు.

కాల్వశ్రీరాంపూర్: మహిళా సంఘాల అభ్యున్నతికి, ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా ఉద్యోగులతో సమష్టిగా కృషి చేద్దామని కాటారం నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు బదిలీపై వచ్చిన ఏపీఎం పల్లె లక్‌కుమార్ అన్నారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్ ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన లక్‌కుమార్‌కు ఉద్యోగులు పుష్పగుచ్ఛమందించి స్వాగతం పలికారు.

ఓదెల: మండల ఐకేపీ ఏపీఎంగా సంపత్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు పని చేసిన లతమంగేశ్వరి పెద్దపల్లికి బదిలీ అయ్యారు. సంపత్‌ను సిబ్బంది సన్మానించారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఇందిరాక్రాంతి పథం ఏపీఎంగా కనకయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ కరీంనగర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డిప్లొమా ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని, క్రమశిక్షణ, అంకిత భావంతో సాగితే సాధించడం సులువేనని ప్రిన్సిపాల్ మణిగణేశన్, అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. ఏవో సురేశ్, హెచ్‌వోడీ డాక్టర్ నటరాజన్, స్వాతి, ప్రభాకర్, విజయ, రాజు, చంద్రశేఖర్, శ్రావణి, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రమాదం పొంచి ఉంది



సుల్తానాబాద్: శాస్త్రినగర్ వైన్స్, కెనాల్ సమీపంలో విద్యుత్ స్తంభంపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

సాక్షి స్పందన



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి 11వ వార్డులో తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సాక్షిలో ప్రచురితమైంది. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలివ్వగా.. ఎంపీవో ఆరీఫ్ హుస్సేన్ గ్రామానికి వెళ్లి పొక్లయిన్‌తో తవ్వించి ప్లంబర్‌తో పైపులైన్ మరమ్మతు చేయించారు. కార్యదర్శి శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సమస్యలు పరిష్కరించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణివ్యాప్తంగా నర్సరీల్లో పని చేస్తున్న తోటమాలి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐఎఫ్‌టీయూ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కార్మికులతో కలిసి ఆర్జీ–2 ఏరియా డీజీఎం పర్సనల్ అధికారి అరవిందరావుకు వినతిపత్రం అందజేశారు.

సైబర్ నేరాలతో మోసపోవద్దు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేశ్

ముత్తారం: సైబర్ నేరాలతో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ముత్తారం ఎస్సై గోపతి నరేశ్ అన్నారు. ముత్తారంలో సోమవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. శాంతిభద్రతలపై వివరించారు. కానిస్టేబుల్ అశోక్, రాజాకుమార్, సుమంత్ రెడ్డి, హోంగార్డ్ గోపాల్ పాల్గొన్నారు.

కేజీవీల్స్ రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు


పెద్దాపూర్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కేజీవీల్స్ ట్రాక్టర్లు తారు రోడ్లపై వెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సనత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పెద్దాపూర్‌లో బొజ్జ నవీన్ కేజీవీల్స్‌తో రోడ్డుపై వెళ్తుండగా పట్టుకొని తహసీల్దార్‌కు సరెండర్ చేశారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గం ఎన్నిక

ఓదెల: గోపరపల్లె గ్రామానికి చెందిన పాస్టర్ రెవ బొంగాని సదయ్యగౌడ్ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పాస్టర్ సురేశ్ (ఎలిగేడు), ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ స్టాలిన్ (కొలనూర్), సహాయ కార్యదర్శిగా పాస్టర్ ఏలియా (కాసులపల్లి), కోశాధికారిగా పాస్టర్ ప్రకాశ్(కాల్వశ్రీరాంపూర్), సభ్యులుగా పాస్టర్ ప్రేంకుమార్(వడ్కాపూర్), పాస్టర్ రాజు(దుబ్బపల్లి) ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎలిగేడు: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదును మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. యుగందర్, చంద్రమౌళి, సత్యనారాయణ, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పోచయ్య, రాజు, రమేశ్, శ్రీకాంత్, సదయ్య, నారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కమాన్‌పూర్: మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజలకు సేవలందిస్తూ.. వారి సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజాప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా విధులు నిర్వహించాలని నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్.అన్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి భరోసా

రామగుండం: పట్టణంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 1986–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల స్నేహితుడు సయ్యద్ మహ్మద్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం వారు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.30వేలు అందజేశారు.

ముత్తారం: మండల కేంద్రానికి చెందిన రౌతు రేష్మిత గుండె వ్యాధితో ఇటీవల మరణించింది. మండలానికి చెందిన ఉపాధ్యాయులందరూ కలిసి రేష్మిత కుటుంబానికి సోమవారం రూ.26,000 అందజేశారు.

పుస్తకాలు పంపిణీ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు త్రిభాషా పుస్తకాలను ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి ప్రభుత్వ పీఈటీ దాసరి రమేశ్ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో రిటైర్డ్ హిందీ పండిత్ దాసరి రాజన్న జయంతి పురస్కరించుకొని పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఢిల్లీ తరలిన కాంగ్రెస్ నాయకులు

ఓదెల: మండలంలోని కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి నాయకుడు తాడూరి శ్రీమాన్ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీ తరలివెళ్లారు. ఢిల్లీలో కాంగ్రెస్ తలపెట్టిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ధర్నా కార్యక్రమానికి వెళ్లారు. ప్రత్యేక రైలులో కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యమకారుల సమస్యలను విన్నవించనున్నట్లు శ్రీమాన్ పేర్కొన్నారు. సామ శంకర్, కందుల సదాశివ్, అల్లం సతీశ్, కొంరయ్య, సదయ్య ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి


వినతిపత్రం అందిస్తున్న అహ్మద్ బాబా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలతోపాటు ఆస్పత్రి సిబ్బంది పెంపుదలకు కాంగ్రెస్ అసంఘటిత కార్మికవర్గ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అహ్మద్ బాబా ఈఎస్ఐ ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ గాయత్రిదేవికి సోమవారం వినతిపత్రం అందించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 50వేల మంది ఐపీలున్న ఆస్పత్రిలో ఒక్క డాక్టర్‌తోపాటు నామమాత్రపు ఉద్యోగులతో వైద్య సేవలందించడం సబబు కాదన్నారు.